సందడిగా పాఠశాలలు

- తెరుచుకున్న బడులు
- తొలి రోజు ఉత్సాహంగా.. తరగతులకు హాజరైన విద్యార్థులు



పీఅండ్‌టీ కాలనీ ఎన్‌ఎంసీ హైస్కూల్‌లో విద్యార్థుల సందడి



మాధవధార జీవీఎంసీ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

సీతంపేట: వేసవి సెలవులు ముగియడంతో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు గురువారం పునః ప్రారంభమయ్యాయి. సుమారు 40 రోజుల పాటు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు ఉత్సాహంగా బడివైపు అడుగులు వేశారు. పిల్లలను స్కూల్ వద్ద దింపేందుకు వచ్చిన తల్లిదండ్రులు, ఆటోలతో సందడి నెలకొంది. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో విద్యార్థుల సంఖ్య 370 కాగా.. 300 మంది వరకు తొలి రోజు పాఠశాలకు హాజరయ్యారని హెచ్‌ఎం శాంతికుమారి తెలిపారు. ఎన్జీవోస్ కాలనీ జీవీఎంసీ పాఠశాలలో విద్యార్థుల హాజరు అంతంత మాత్రంగా ఉంది. విద్యార్థులు తమ స్నేహితులతో ముచ్చటిస్తూ కన్పించారు. వేసవి సెలవుల్లో ఏవిధంగా గడిపారో ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు.

కళకళలాడిన ఎన్‌ఎంసీ హైస్కూల్

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని ఎన్‌ఎంసీ హైస్కూల్ తొలి రోజు విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రాకతో కళకళలాడింది. ఆరు నుంచి పదో తరగతి వరకు సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఇక్కడ చదువుతుండగా.. 28 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రస్తుతం ఆరో తరగతిలో అడ్మిషన్లు జరుగుతున్నాయి. తొలి రోజు 500 మంది వరకు విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం డి.రామ్‌ప్రసాద్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఆరో తరగతిలో అడ్మిషన్ల గురించి మార్గదర్శకాలను వివరించారు. పదో తరగతి పాసైన విద్యార్థులకు త్వరితగతిన టీసీలు జారీ చేయాలని ఆదేశించారు.

ఆటపాటలకు సెలవు

మురళీనగర్: వేసవి సెలవుల్లో ఆటపాటలతో బిజీగా గడిపిన విద్యార్థులు బడిబాట పట్టారు. ఇన్ని రోజులు ఇంటిపట్టున ఉన్న చిన్నారులకు పాఠశాలలకు వెళ్లే మొదటి రోజు కాస్త ఇబ్బందిగా ఉన్నా.. భవిష్యత్ నిర్మాణానికి చదువులకు కొలువైన పాఠశాలలకు వెళ్లాల్సిందే. దీంతో మురళీనగర్ పరిసరాల్లోని పాఠశాలల్లో విద్యార్థుల రాకతో సందడి కనిపించింది. మాధవధార జీవీఎంసీ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, ఏఎస్‌ఆర్ నగర్‌లోని కె.కాలనీ జీవీఎంసీ ఉన్నత పాఠశాల, బర్మా కాలనీ ప్రాథమిక పాఠశాలతోపాటు వివిధ ప్రాంతాల్లోని ప్రైవేటు స్కూళ్లు తెరుచుకున్నాయి. ఉదయం నిర్దేశిత సమయానికి విద్యార్థులు పాఠశాలలకు చేరుకుని ప్రార్థనలో పాల్గొన్నారు.



మధురానగర్ జీవీఎంసీ ప్రైమరీ స్కూల్ తరగతి గదిలో విద్యార్థులు

67 మంది చేరిక

మాధవధార హైస్కూల్‌లో ప్రస్తుతం 778 మంది విద్యార్థులు చదువుతుండగా.. గురువారం 67 మంది కొత్తగా చేరినట్లు హెచ్‌ఎం బి.హేమలత తెలిపారు. కె.కాలనీ ఉన్నత పాఠశాలలో 500 మందికి తొలి రోజు 150 మంది హాజరైనట్లు హెచ్‌ఎం సాయిలక్ష్మి చెప్పారు. శుక్రవారం విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తామన్నారు. గురువారం 20 మంది కొత్తగా చేరారు. బర్మా కాలనీ ప్రాథమిక పాఠశాలలో 350 మంది విద్యార్థులు చదువుతున్నారు.

చోరీ కేసులో దర్యాప్తు ముమ్మరం



నందగిరి కాలనీలో చోరీ జరిగిన ఇంటి వద్ద పరిశీలిస్తున్న క్రైం డీసీపీ వెంకటరత్నం

సీతమ్మధార: అక్కయ్యపాలెం దరి నందగిరి కాలనీలో జరిగిన చోరీ కేసులో క్రైం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఇక్కడి రామలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న సిహెచ్.సూర్యప్రకాశరావు ఇంట్లో రూ.లక్ష నగదు, 166 గ్రాముల బంగారం బుధవారం చోరీ కావడం తెలిసిందే. ఈ నెల 7న సూర్యప్రకాశరావు హైదరాబాద్ వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి చూడగా బీరువా తెరిచి ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించాడు. క్రైం పోలీసుల దర్యాప్తులో భాగంగా గురువారం వీధిలోని సీసీ కెమెరాల నుంచి సేకరించిన పుటేజీలు పరిశీలించారు. క్లూస్ టీమ్ సేకరించిన వేలిముద్రలను పాత నేరస్తుల వేలిముద్రలతో సరిపోలుస్తున్నారు. ఈ కేసులో ఒక అనుమానితుడిని గుర్తించినట్టు సమాచారం. డీసీపీ (క్రైం) వెంకటరత్నం పర్యవేక్షణలో సీఐ ఎస్.ఆదామ్ ఆధ్వర్యంలో క్రైం ఎస్‌ఐ భాస్కరరావు, ఇతర పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు శుక్రవారం నాటికి ఒక కొలిక్కి వస్తుందని పోలీసులు భావిస్తున్నారు.

ఎల్‌హెచ్‌ఎంఎస్‌పై అవగాహన పెరగాలి

లాక్డ్ హౌస్ మోనటరింగ్ సిస్టమ్(ఎల్‌హెచ్‌ఎంఎస్)పై ప్రజల్లో ఇంకా అవగాహన లేనందునే ఇళ్లలో చోరీలు జరుగుతున్నాయని క్రైం పోలీసులు చెబుతున్నారు. వేసవి సెలవులు, సంక్రాంతి, దసరా సెలవులు, ఇతర శుభకార్యాల సమయంలో ఊళ్లకు వెళ్లే ప్రజలు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ముందుగా సమాచారం ఇస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ కింద ఇంట్లో పోలీసులే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తారు. వీటిని సంబంధిత పోలీసులు నిరంతరం మోనటరింగ్ చేస్తారు. ఇంట్లో ఎవరైనా దొంగలు ప్రవేశించిన వెంటనే సదరు స్టేషన్‌లో అలారం మోగి దగ్గరలోని పోలీసులను అలెర్ట్ చేస్తారు. ఫలితంగా దొంగలను పోలీసులు త్వరితగతిన పట్టుకునేందుకు కూడా ఆస్కారం ఉంటుంది. ఎల్‌హెచ్‌ఎంఎస్ గురించి పోలీసులు కూడా తగినంత ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ముఖ్యంగా షాపింగ్ కాంప్లెక్స్‌లు, అపార్ట్‌మెంట్లలో అవగాహన సమావేశాలు ముమ్మరంగా నిర్వహిస్తే ఈ విధానంపై అవగాహన పెరిగి సత్ఫలితాలు వస్తాయని పలువురు భావిస్తున్నారు.

వేగవంతంగా అభివృద్ధి పనులు

- గెడ్డల్లో పూడికలు సకాలంలో తొలగించండి
- జీవీఎంసీ ఏడీసీ విశ్వనాథన్ ఆదేశం



జోన్-3 కార్యాలయంలో అధికారులతో సమీక్షిస్తున్న అదనపు కమిషనర్ విశ్వనాథన్

సీతమ్మధార: అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను జీవీఎంసీ అదనపు కమిషనర్ విశ్వనాథన్ ఆదేశించారు. ఆశీలమెట్టలోని జీవీఎంసీ జోన్-3 కార్యాలయంలో గురువారం అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీ మాట్లాడుతూ వర్షా కాలం ప్రారంభమైనందున జోన్ పరిధిలోని ముఖ్యమైన గెడ్డల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికలను త్వరితగతిన తొలగించాలని ఆదేశించారు. తద్వారా వర్షపు నీరు నిల్వ ఉండకుండా సముద్రంలో నేరుగా కలిసేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. మినీ పార్కుల నిర్వహణను మెరుగుపర్చాలని సూచించారు. జోన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని ఇంజినీర్లు, అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛ భారత్ మిషన్ పనులు త్వరగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో జోన్-3 కమిషనర్ విజయలక్ష్మి, జీవీఎంసీ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తాటిచెట్లపాలెం: అక్కయ్యపాలెం సెక్షన్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్-1 ఈఈ (ఆపరేషన్స్) బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు నరసింహనగర్, రైతుబజార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

కంచరపాలెం సెక్షన్‌లో..

కంచరపాలెం: జోన్-2 డివిజన్ కంచరపాలెం సెక్షన్ పరిధి సబ్ స్టేషన్‌లో 11 కేవీ బర్మా క్యాంప్ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, పాలిటెక్నిక్ కళాశాల, నలందనగర్, దేవేంద్రనగర్, కంచరపాలెం రైతుబజారు, రవీంద్రనగర్, ఇంటెలిజెన్స్ కార్యాలయం ఏరియా, అశోక్‌నగర్, గంగన్ననగర్, జోగారావునగర్, తిక్కవానిపాలెం, ధర్మానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్రిపాలెం సెక్షన్‌లో..

మురళీనగర్: జోన్-2 డివిజన్ మర్రిపాలెం సెక్షన్ పరిధి ఎఫ్‌సీఐ 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బి.కె.నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు భాస్కర్ గార్డెన్స్, ఎఫ్‌సీఐ పార్కు, శివనగర్, రామాలయం వీధి, మర్రిపాలెం వుడా లేఅవుట్, శివశివానీ పాఠశాల రహదారి ఏరియా, పోలీస్ క్వార్టర్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

క్లుప్తంగా

లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో నూతన వైద్య సేవలు



లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి భవనం

సీతమ్మధార: సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఇంటర్వెన్షనల్ పెయిన్ మేనేజ్‌మెంట్ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని ఆస్పత్రి ట్రస్టీ ప్రొఫెసర్ వి.ఉమామహేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికాలో పేరుగాంచిన డాక్టర్ గౌరీభవన్ పోతిని పర్యవేక్షణలో రోగులకు వైద్య సేవలు అందజేస్తామని చెప్పారు. సంప్రదాయక నొప్పి నిర్వహణ మాదిరిగా కాకుండా ఇంటర్వెన్షనల్ పెయిన్ మేనేజ్‌మెంట్ పద్ధతి విధానాల ద్వారా స్టెరాయిడ్ ఇంజక్షన్లు, ఇతర చికిత్సలు ఉంటాయన్నారు. పలు రకాల సమస్యలకు 70 అల్ట్రా సోనోగ్రఫీ ద్వారా ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బొటులినుమ్ టాక్సిన్ వైద్య సేవలు అందుబాటులో ఉన్నందున ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమామహేశ్వరరావు కోరారు.

వృద్ధురాలి అదృశ్యం



పోలమ్మ

సీతమ్మధార: ఓ వృద్ధురాలి అదృశ్యంపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. దొండపర్తికి చుక్కావారి వీధిలో భాశెట్టి పోలమ్మ అనే వృద్ధురాలు ఒంటరిగా నివసిస్తోంది. గత నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఈమె కొంత కాలంగా మతిస్థిమితం లేక బాధపడుతోంది. ఈమె తన కుమారుడు ఇంటి ఎదురుగా ఉన్న ఒక ఇంట్లో ఉంటోంది. కుమారుడు అప్పలరాజు తన తల్లి ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆయన గురువారం ఫోర్త్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌సీ బి.వరలక్ష్మి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



పాలిశెట్టి జగ్గప్పారావు

అల్లిపురం: మతి స్థిమితం లేని వ్యక్తి అదృశ్యమైనట్లు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు నమోదయింది. సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం ఆర్‌ఆర్ వెంకటాపురం, రామాలయం వీధికి చెందిన పాలిశెట్టి జగ్గప్పారావు కోవిడ్ సమయంలో శానిటైజర్‌కు అలవాటు పడి మానసికంగా బాధపడుతున్నాడు. అతను సౌత్ జైలురోడ్డులోని పోలీస్ క్వార్టర్స్ ఎదురుగా ఉన్న భువనేశ్వరి మెకానిక్ షాప్‌లో పని చేస్తున్నాడు. ఈ ఏడాది ఏప్రిల్ 24వ తేదీన గాంధీ బొమ్మ దగ్గరలో గల సులభ్ కాంప్లెక్స్‌కు వెళ్తున్నట్లు చెప్పి సాయంత్రం 7.30 గంటల సమయంలో వెళ్లి తిరిగి రాలేదు. అతని కోసం బంధువులు వెతికినా ఆచూకీ తెలియ రాలేదు. దీంతో అతని భార్య కళ్యాణి టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తన భర్త వయసు 42 సంవత్సరాలని, చామన ఛాయతో, 5 అడుగుల 7 అంగులాల ఎత్తు, చింతపిక్క రంగు ప్యాంటు, స్కైబ్లూ కలర్‌పై చెక్స్ షర్టు వేసుకుని ఉన్నట్లు తెలిపింది. ఆచూకీ తెలిసిన వారు 9440904716, 8919812412 ఫోన్ నంబర్లలో తెలిపాలని కోరారు.

జైల్‌లో రక్తదాన శిబిరం

ఆరిలోవ: అంతర్జాతీయ రక్తదాన దినోత్సవం సందర్భంగా గురువారం విశాఖ బ్లడ్ డోనర్స్ క్లబ్, హెల్పింగ్ హర్ట్స్ ఆధ్వర్యంలో విశాఖ కేంద్ర కారాగారంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కారాగారం సూపరింటెండెంట్ ఎస్.కిశోర్‌కుమార్, అడిషనల్ సూపరింటెండెంట్ ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు పి.ఎస్.రామచంద్రరావు, కమలాకర రావు, పలువురు సిబ్బంది రక్తదానం చేశారు.

స్కూళ్లకు స్టూడెంట్ కిట్లు



ఎన్‌ఎంసీ హైస్కూల్‌లో కిట్లు పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

సీతమ్మధార: పీ అండ్ టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌కు పాఠ్య పుస్తకాలు చేరుకున్నాయి. కొత్త ప్రభుత్వ హయాంలో సిద్ధం చేసిన స్టూడెంట్ కిట్లు కూడా పాఠశాలలో సిద్ధంగా ఉన్నాయి. నోటు పుస్తకాలు, బ్యాగు, బూట్లు, బెల్టు వంటి సామగ్రితో కూడిన ఈ కిట్లను విద్యార్థులకు అందజేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రామ్ ప్రసాద్ 'సాక్షి'తో మాట్లాడుతూ స్టూడెంట్ కిట్లలో 246 మీడియం సైజ్, 181 లార్జ్ సైజ్ బెల్టులు, 733 స్కూల్ బ్యాగులు, 982 బ్రాడ్‌రూల్, 597 గ్రాఫ్, 4,538 సింగిల్ రూల్, 4153 తెలుపు నోటు పుస్తకాలు ఉన్నాయని తెలిపారు. త్వరలోనే ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఈ కిట్లను అందజేస్తామని చెప్పారు. ప్రస్తుతం తమ పాఠశాలలో వెయ్యి మంది వరకు విద్యార్థులు ఉన్నారని, ఆరో తరగతిలో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ కిట్లను హెచ్‌ఎం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పరిశీలించి, వివరాలు నమోదు చేశారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పూజలో పాల్గొనవచ్చు. ఈ పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. ఆలయ ఈవో శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు వైద్య సేవలందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: మారుమూల ప్రాంతాల్లో క్యాన్సర్ రోగులను గుర్తించి వారికి వైద్య సేవలందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. గురువారం ఆంధ్రా మెడికల్ కాలేజీ పరిధిలో జరిగిన క్యాన్సర్ నివారణ శిక్షణలో ఆయన పాల్గొన్నారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న వారిని సకాలంలో గుర్తించి వైద్యం అందిస్తే మరికొంత కాలం పాటు ఆ వ్యక్తి బతికే అవకాశం ఉంటుందని, ఆ కుటుంబానికి మేలు జరుగుతుందన్నారు. క్యాన్సర్ రాకుండా తీసుకునే చర్యల గురించి వివరించారు. నెల రోజుల పాటు శిక్షణ కార్యక్రమం జరుగుతుందని, మొత్తం మూడు బ్యాచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన వారు వారి పరిధిలో ప్రజలకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎన్.సమత, వైద్య ఆరోగ్యశాఖ సంయుక్త అధికారి డాక్టర్ నిర్మలగౌరి, ఏఎంసీ అంకాలజీ విభాగం నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుష్మ, ప్రొగ్రామ్ అధికారులు, అన్ని సామాజిక ఆరోగ్య కేంద్రాలకు చెందిన అధికారులు, గైనకాలజిస్టు, డెంటల్ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యకర అలవాట్లపై అవగాహన



హెచ్‌ఎం నిర్మలకు మొక్క అందిస్తున్న భూషణం మాస్టారు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు గవర వీధి ప్రాథమికోన్నత పాఠశాలలో ఆరోగ్యవంతమైన జీవితానికి ఎన్నుకోవలసిన పద్ధతులు అనే అంశంపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం సిహెచ్.నిర్మల మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉండాలంటే చిన్ననాటి నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవరుకోవాలని సూచించారు. బయట దొరికే చిరుతుల్లు, జంక్ ఫుడ్, పిజ్జా, బర్గర్ వంటివి తినకూడదన్నారు. ఎక్కువగా మరిగే నూనె పదార్థాలు ఆరోగ్యానికి హానికరమని వివరించారు. సామాజిక కార్యకర్త, విశ్రాంత ఉపాధ్యాయుడు ఐ.భూషణం మాస్టారు మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడి విద్యను అభ్యసిస్తే అది చిరకాలం మనతో ఉంటుందని, ఉన్నతులుగా తీర్చిదిద్దుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే మంచి ఆరోగ్యకర అలవాట్లు చేసుకుంటే మానసిక, శారీరక దారుఢ్యం కలుగుతుందని చెప్పారు. అందరూ మొక్కలు నాటడం అలవాటుగా మార్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని నిర్మలకు ఆయన మొక్కను గుర్తుగా అందజేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన అవసరం



మలేరియాపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది


మద్దిలపాలెం: మలేరియాపై అవగాహన అవసరమని మలేరియా సబ్ యూనిట్ సూపర్‌వైజర్ బ్రహ్మకుమార్ అన్నారు. మలేరియా మాసోత్సవ అవగాహన ర్యాలీని గురువారం శివాజీపాలెం, నౌకానగర్, పెదవాల్తేరు, కాగితాల వీధిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి నిల్వ లుంటే దోమల ఉత్పత్తి అవకాశాలుగామారుతాయని, ఎప్పటికప్పుడు నిల్వ నీటిని తొలగించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కోరారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాపిస్తాయని చెప్పారు. జ్వరం వస్తే ముందుగా పట్టణ ఆరోగ్య కేంద్రాలలో రక్త పరీక్షలు చేసుకోవాలని అవగాహన కల్పించారు. జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోనా వేణుగోపాల్, సచివాలయ ఏఎన్ఎం, ఆశా వర్కర్, జీవీఎంసీ యాంటీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

శృంగమణి కొండపై.. ఆధ్యాత్మిక ఝురి

- వెంకన్న తిరు కల్యాణోత్సవానికి ఏర్పాట్లు
- 17 నుంచి 23 వరకు నిర్వహణ
- విశేషంగా తరలి రానున్న భక్తులు



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి



విశాఖ పోర్టు శృంగమణి కొండపై వెలసిన వేంకటేశ్వరస్వామి ఆలయం



సూర్యాబాగ్ మెయిన్ రోడ్డులో విశ్వేశ్వరస్వామి ఆలయం

డాబాగార్డెన్స్: కోటవీధి శృంగమణి కొండపై కొలువై ఉన్న వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఏర్పాట్లు జరుపుతున్నారు. ఈ దేవాలయాన్ని 17వ శతాబ్దంలో ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యుడు గడియారం రంగస్వామిపాత్రుడు నిర్మించారు. ఈ నిర్మాణం వెనుక ఆధ్యాత్మిక కథనం ప్రచారంలో ఉంది. 1790లో డచ్‌వారు వ్యాపారాల కోసం సముద్రయానం చేస్తున్నారు. సముద్రం అల్లకల్లోలంగా ఉండడంతో వారు ప్రయాణిస్తున్న నౌక ప్రమాదంలో చిక్కుకుంది. అందులో పని చేస్తున్న హిందూ భక్తుడు నౌక సురక్షితంగా ఒడ్డుకు చేరుకుంటే శృంగమణి కొండపై వెంకన్నకు ఆలయం కట్టిస్తానని మొక్కుకున్నాడు. తెల్లవారే సరికి సముద్రం ప్రశాంతంగా మారింది. తీరానికి చేరువయ్యే సమయంలో నౌక లంగరు వేసినట్లు సముద్రంలో ఉండిపోయింది. నీట్లోకి దిగి చూస్తే నౌక యాంకర్‌కు వేంకటేశ్వరస్వామి విగ్రహం ఉంది. వెంటనే విగ్రహాన్ని వెలికి తీసి తోటవీధి, కోటవీధి ప్రజలతో మాట్లాడి ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయాన్ని అన్ని మతాల ప్రజలతో పాటు బ్రిటీష్, డచ్‌వారు కూడా సందర్శించేవారు. ఆలయాన్ని పోర్టు యాజమాన్యం 1926లో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసింది. 1954లో గాలి మండపాలు, మెట్ల మార్గం, మండపాలు నిర్మించారు. అదే ఏడాది దేవదాయ శాఖ ఆధీనంలోకి వెళ్లింది. అయినప్పటికీ ఆలయానికి అవసరమైన నిధులను విశాఖ పోర్టు ట్రస్ట్ కొంత కాలం పాటు సమకూర్చింది. తర్వాత భక్తులు ఇచ్చే విరాళాలతో ఆలయాన్ని నడిపారు. ఏటా స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహిస్తున్నారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారు.

తిరుకల్యాణ మహోత్సవాలు ఇలా..

ఈ నెల 17 నుంచి 23 వరకు వేంకటేశ్వరస్వామికి మేళతాళాలతో తిరుకల్యాణ మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా గురువారం సాయంత్రం పందిరి రాట వేశారు. ఈ నెల 17న ఉదయం 5 గంటలకు సుప్రభాతం, ఆరాధన హోమాలు, సాయంత్రం 6 గంటలకు ఋత్విగ్వరణం, మృత్యంగ్రహణం, అంకురార్పణ, విశేష హోమాలు నిర్వహించనున్నారు. 18 ఉదయం 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 4.30 గంటలకు కొట్నాల ఉత్సవం, ఎదురు సన్నాహం, 6.30 గంటలకు స్వామి వారి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. తోలాడ గవరమ్మ, కస్తూరి ఉమాపతిరావు, వేల్పూరి రాజకుమార్ దంపతుల విరాళంపై వచ్చిన వడ్డీతో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. 19 ఉదయం నిత్య పూజలు, సాయంత్రం 5 గంటలకు గరుడ వాహనంపై తిరువీధి ఉత్సవం, 20 సాయంత్రం 4 గంటలకు సదస్యం, పండిత గోష్ఠి, తీర్థగోష్ఠి, 21 సాయంత్రం 4 గంటలకు స్వామి వారి తెప్పోత్సవం (ప్లవోత్సవం) జరగనుంది. పోర్టు సహాయ సహకారాలతో శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామిని మేళతాళాలతో పైలట్ లాంచిలో అధిష్ఠింపజేసి సముద్రంపై అతివైభవంగా వేడుక జరపనున్నారు. 22న పూర్ణాహుతి, సముద్రస్నానం, సాయంత్రం 6 గంటలకు చూర్ణోత్సవం (దొంగల దోపోత్సవం), చివరి రోజు 23న శ్రీపుష్ప యాగం నిర్వహించనున్నారు.

కల్యాణంలో పాల్గొనదలచే వారు..

స్వామి కల్యాణోత్సవంలో పాల్గొనదలిచే దంపతులు రూ.1,116 చెల్లించాలి. కార్యక్రమాలు జరిగే వారం రోజులు వారి పేరిట గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపి శేష వస్త్రాలు, స్వామి ప్రసాదం అందజేయనున్నారు. 29న మధ్యాహ్నం 12 గంటలకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. వివరాలకు 79897 09244 నంబర్‌లో సంప్రదించవచ్చు.

17 నుంచి విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో వెలసిన విశ్వేశ్వర స్వామి కల్యాణోత్సవాలు ఈ నెల 17 నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ మేనేజర్ అడపా దేవుళ్లు తెలిపారు. 17న మండపారాధన, త్రిశూల పూజ, సాయంత్రం విశ్వేశ్వరస్వామి, బాలా త్రిపుర సుందరి దేవి కల్యాణ మహోత్సవం, 18, 19, 20 తేదీల్లో ప్రత్యేక హోమాలు, 21 సాయంత్రం 5 గంటలకు నాగవల్లి శేష హోమం, 22న హోమాలు, ఆ రోజు రాత్రి 8.30 గంటలకు పుష్పాంజలి సేవ ఉంటుందని చెప్పారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నసమారాధన నిర్వహించనున్నట్టు చెప్పారు. కల్యాణోత్సవాల్లో భాగంగా లలిత, విష్ణు సహస్ర నామ పారాయణం ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ), ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణ ఇస్తున్నామని అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ప్లంబింగ్ ట్రేడ్‌లలో ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఎలక్ట్రీషియన్ ట్రేడుకు పదో తరగతి, ప్లంబింగ్ ట్రేడుకు 8వ తరగతి పాసైన వారు అర్హులన్నారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 45 సంవత్సరాలు ఉండాలన్నారు. మూడు నెలలపాటు శిక్షణ అనంతరం సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్ఏసీ శిక్షణ కేంద్రంలో, లేదా 91332 42666, 83090 03957 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.